RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 242 పేజీలు - 08 మంగళవారం 28 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం




# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

## - మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

- గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 27 :** పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా వి పక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ మిగతా2లో...




## కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 27 :** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమ వారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మిగతా2లో...

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

- ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు
- డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి




## ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం




# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం - అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు మిగతా2లో...

## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి మిగతా2లో...



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్


## కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 27 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మిగతా2లో...

## ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిదునాక్ష్మికంగా సందర్శించారు. సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు మిగతా2లో...

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్



**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్ ఇచ్చింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 14, 16 అధికరణాలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది.గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జులై 27 :**నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది.ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోట్గి÷ చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

**తొలి అక్షరం/అమరావతి,జులై 27:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్గ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్గ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతి స్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

# ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**తొలి అక్షరం/హైదరాబాద్,జులై 27:** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**● రూ.5 కోట్ల7 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ● పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ వస్తం) జూలై 27:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు.తొర్రూరు మండలంలోని నాంచారి మదూరు,గుడిబండ తండ, వెలకట్ట,పెద్ద మంగ్య తండా, వెంకటాపురం,అమర్ సింగ్ తండా,దుబ్బ తండ, చీకటియపాలెం,ఫతేపురం, పోలేపల్లి,ఎస్వికె తండా, గుర్తురు,ఖానాపురం,హచ్చు తండా, కొమ్మనపల్లి తండా గ్రామాలలో సుమారు రూ.5 కోట్ల 7 లక్షల నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం పనులకు సోమవారం ఆయా శాఖల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయన్నారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు,అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేసి పల్లెల ప్రగతికి బాటలు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాలు ప్రజా ప్రభుత్వంలో అందుతున్నట్లు తెలిపారు. పేదలకు సన్న బియ్యం అందించి వారి కడుపు నింపుతున్నామని తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు సైతం అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూణం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్,కాంగ్రెస్ నాయకులు జాటోత్ హమ్యా నాయక్,డాక్టర్ పి. సోమేశ్వరరావు,గంజి విజయపాల్ రెడ్డి,చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి,మేకల కుమార్, వెంకన్న యాదవ్,చెవిటి సదాకర్,మహబూబ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి,విక్రమ్ రెడ్డి,పింగిలి ఉష,రవి నాయక్, మిత్తింటి హరీష్, వెంకటాచారి,బిక్షం గౌడ్, దేవేందర్ రాజు,ప్రవీణ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసరావు,రమేష్,సాయి కిరణ్, నరేష్, సర్పంచ్ లు బంగారు రమేష్, అభిరామ్, బందు శ్రీనివాస్, జాటోత్ రాం లాల్,విజయ రవి, గంగా నరేష్,విజయ లింబ, కృష్ణమూర్తి,మాధవరెడ్డి,పి.కళావతి,బానోత్ సాగర్, కవిత బాలకృష్ణ,ఎండి.మహిపాషా, బానోత్ బిక్షపతి, బానోత్ శ్రీను నాయక్,వార్డు సభ్యులు,స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీటీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిను కలుసుకున్న నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు





**పెద్దవంగర జులై 27తొలి అక్షరం:** ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు గారు తన అనుచర ఘనంతో స్థానిక శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి గారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందించి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.అనంతరం ప్రవీణ్ రావు మాట్లాడుతూ కార్యకర్తలను సమన్వయం పరుస్తూ గ్రామ,మండల అభివృద్ధి తమదైన శైలితో ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే గారిని ప్రత్యేకంగా కోరడం జరిగింది.దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రగొర్ల రమేష్.కోడకండ్ల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్తినేని శ్రీనివాస్,మాజీ ఎంపీపీ బానోతు వెంకన్న,రైతు సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ తంగేళ్లపల్లి మల్లికార్జున చారి,పెద్దవంగరం మండల హ్యూమన్ రైట్స్ చైర్మన్ డాక్టర్ కుమ్మరి రామ్మూర్తి, వార్డు సభ్యులు గద్దల యాకలక్ష్మి యాకన్న, కేశబోయిన మల్లయ్య,పాక అనిల్,బారాజు రాజు,తంగేళ్లపల్లి కిరణ్,సాయిని వెంకన్న,బండారి రాజు, తుర్క క్రిస్టపర్,కొమ్మనబోయిన మహేష్ , గుగులోతు అనిల్,బీసు సునీల్,శివరాత్రి వెంకటేష్,పాక స్వామి,తాటిపాముల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సోల్తి కిరణ్ కుమార్ గౌడ్‌కు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ ప్రధానం









**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో పార్ట్ టైం అధ్యాపకుడిగా పనిచేస్తున్న సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ కు ఏ కంపారటివ్ అనలేసిస్ ఆఫ్ సైకో ఫిజికల్ ఫిట్నెస్ కపోనెంట్స్ అమాంగ్ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ కబడ్డీ అండ్ ఖోఖో ప్లేయర్స్ అనే పరిశోధన గ్రంథం అన్నామలై యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పి.సెంథిల్ పర్యవేక్షణలో సమర్పించగా అన్నామలై యూనివర్సిటీ వారు డా.సోల్తి.కిరణ్ కుమార్ గౌడ్ కి ఫిసికల్ ఎడ్యుకేషన్లో డాక్టరేట్ ప్రకటించారు.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా,ఖిలా వరంగల్ మండలం,బొల్లికుంట గ్రామస్థులు,యూనివర్సిటీ లోని అధ్యాపకులు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థిని విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డా.సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ ను కేయు ఫిసికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.కాకతీయ యూనివర్సిటీలోని ఫిసికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో పార్ట్ టైం అధ్యాపకునిగా పనిచేస్తున్న డా.సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ ఇటీవల పీహెచ్డీ పూర్తి చేసుకున్న సందర్భంగా కేయు ఫిసికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో టీచింగ్,నాన్ టీచింగ్ సిబ్బంది,విద్యార్థులు కలిసి డా.సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ ను శాలువలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిసికల్ ఎడ్యుకేషన్ కేయు ప్రిన్సిపాల్ డా.పి.భాస్కర్,కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.ఎస్.కుమారస్వామి, డా.జేత్య,అన్వేష్,పల్లవి,సీనియర్ అసిస్టెంట్ సుమన్,సుధాకర్,రామనాథం, రామకృష్ణ,కొమురమ్మ,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఎమ్మెల్యే మందుల సామేలు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ఉబ్బు వెంకటయ్య చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్**

**తుంగతుర్తి కాంగ్రెస్‌లో విభేదాలకు ఎమ్మెల్యే వైఖరే కారణమని మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ విమర్శ**



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 27:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోమటిరెడ్డి బ్రదర్స్‌కు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య డిమాండ్ చేశారు.సోమవారం లక్కారంలోని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే మందుల సామేలు ఇప్పుడు దళితుల పేరుతో తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీలో కొత్త వివాదాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.గతంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతోనే తనకు టికెట్ లభించిందని చెప్పిన సామేలు, ఇప్పుడు ఆ మాటలను మార్చడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కుల ప్రస్తావన తీసుకొస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో తనను గెలిపించిన దళిత కార్యకర్తలకు ఎంత మేరకు ప్రాధాన్యం కల్పించారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరైనది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూడాలని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదన్నారు.ఎస్సీ సెల్ ఉపాధ్యక్ష పదవిని తన కుమారుడికి ఇవ్వడం, మరో కుమారుడికి కాంట్రాక్టులు అప్పగించడం ద్వారా కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవులు ఇవ్వకుండా మండల అధ్యక్ష పదవులను డబ్బుల కోసం విక్రయిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు.ఈ విలేకరుల సమావేశంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓ,బిఎల్ఎలకు దిశా నిర్దేశం చేసిన ఖాజీపేట తహసీల్దార్




**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** బి ఎల్ ఓ, బి ఎల్ ఎ లకు ఖాజీపేట తహసీల్దార్ సి హెచ్ రాజు దిశా నిర్దేశం చేశారు.31 వ డివిజన్ లో వేగవంతంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జరుగుతుందన్నారు.ప్రతి అర్హత కలిగిన ఓటర్ కు అన్యాయం జరగకుండా చూడాలని బి ఎల్ ఓ, బి ఎల్ ఎ లకు హితవు పలికారు.సుమారుగా 75% ప్రక్రియ పని పూర్తిగా అయిందని మిగతా 25 శాతం పని అత్యంత వేగవంతంగా చేయాలని బి ఎల్ ఓ లను కోరారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ అధ్యక్షులు అంకేశ్వర్ సురేందర్,డివిజన్ సూపర్వైజర్ సుదర్శన్,కనుకుంట్ల కృష్ణ,సత్తు రమేష్,వెనుకంటి బాలకృష్ణ,వేల్పుల ప్రవీణ్,డిసిసి కార్యవర్గ సభ్యులు మామిండ్ల సురేష్,సీనియర్ నాయకులు యూత్ నాయకులు పాల్గొన్నారు

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి

**వరంగల్,హనుమకొండ జిలా ల్ల కలెక్టర్లకు వినతి**

**తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాక్ చైర్మన్ గట్టు నరేష్ గౌడ్**



**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** బహుజన విప్లవ వీరుడు, స్వరాజ్య స్థాపకుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ జయంతి వేడుకలను ఆగస్టు 18న గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని కోరుతూ తెలంగాణ గౌడ యువజన సంఘం (టి జి వై ఎస్) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కలెక్టర్ మరియు హనుమకొండ జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ మాట్లాడుతూ...సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ బహుజనుల ఆత్మగౌరవానికి,పోరాట స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు.ఆయన చరిత్రను, త్యాగాలను నేటి తరాలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు.ఆగస్టు 18న జరిగే జయంతి వేడుకలను గ్రామ,మండల,రెవెన్యూ డివిజన్,జిల్లా స్థాయిల్లో అధికారికంగా నిర్వహించి, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘాలు,బహుజన సంఘాల ప్రతినిధులు,ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్లను కోరినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులకు ముందస్తు ఆదేశాలు జారీ చేసి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే జిల్లా స్థాయి ప్రధాన కార్యక్రమాన్ని బహిరంగ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించి,సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,గౌడ సంఘాల నాయకులు,బహుజన సంఘాల ప్రతినిధులను అధికారికంగా ఆహ్వానించాలని కోరారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ చరిత్ర,ఆయన చేసిన పోరాటాలు,బహుజన సమాజానికి అందించిన స్ఫూర్తిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. బండారి జనార్ధన్ గౌడ్,చిర్ర సుమన్ గౌడ్,నాగపూరి వెంకటేష్ గౌడ్,నరేష్ గౌడ్ తదితర గౌడ నాయకులు పాల్గొన్నారు.

# నల్ల పాపయ్య మృతి చాలా బాధాకరం

**- గర్దాసు విక్రమ్ సర్పంచ్ ఇంద్రపాలనగరం**

**తొలి అక్షరం/రామన్నపేట జులై 27:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలోఅకాల మరణం చెందిన నల్ల పాపయ్య మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, ఈర్లపల్లి మల్లయ్య,రాస వెంకటేష్, చేనేత సహకారసంఘము చైర్మన్ రవ్వ నర్సింహా,మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్,మాజీ వార్డ్ సభ్యులు నిమ్మగడ్డ పద్మారావ్,పగుడాల వెంకటేష్,నక్క వెంకటేష్,రాజన్నగారి మురళి,నల్ల శంకరయ్య,కొమ్మగోని సంజీవ,కాటేపల్లి మహేష్,మాధం నగేష్,తదితరులు పాల్గొన్నారు





## తెలంగాణ ఉద్యమకారులకు తక్షణమే
# గుర్తింపు కార్డులు ఇవ్వాలి

**• గంధ మల్ల బాలయ్య తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి జిల్లా అధ్యక్షులు**






**తొలి అక్షరం/రామన్నపేట జూలై 27:** రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశంలో డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని. రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ వేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ కమిటీ పేరుతో కాలయాపన కాకుండా మండల వ్యాప్తంగా ప్రతి గ్రామ గ్రామంలో తెలంగాణ కోసం ఉద్యమం చేసిన నిజమైన ఉద్యమకారులకు గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని. ఉద్యమకారుల యొక్క న్యాయపరమైన హక్కులను నెరవేర్చాలని. ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలంతో పాటు 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని వారికి హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని ఉద్యమంలో పాల్గొని కేసులు అయిన వారి తో పాటు బైండోరాయ్ ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఉద్యమకారుని కేకే కమిటీ వారి ప్రతినిధులతో రాష్ట్ర వ్యాప్తంగా వారిని గుర్తించి న్యాయం చేయాలని అమరులైన కుటుంబాలకు న్యాయం చేయాలని జిల్లా అధ్యక్షులు గంధ మల్ల బాలయ్య తెలిపినారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కళాకారుల సంఘం జిల్లా కన్వీనర్ గంధ మల్ల వెంకటేశం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి గౌరవ అధ్యక్షులురెబ్బాసు. రాములు ఉద్యమ నాయకులు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి సిపిఐ మండల మాజీ సెక్రటరీ రామన్నపేట మాజీ ఉపసర్పంచ్ గంగాపురం యాదయ్య ఉద్యమ నాయకులు స్థానికం చీఫ్ ఎడిటర్ డాక్టర్. కొండ మల్లేష్ రామన్నపేట మండలాధ్యక్షులు నోముల శంకర్ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మాజీ ఉపాధ్యక్షులు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి ఇమామ్ మద్దెగల్ల. నరసింహ ఉద్యమ నాయకులు మన ప్రగతి రిపోర్టర్ కైరం కొండ సంతోష్ ఉద్యమ నాయకులు ఎర్ర రమేష్ గౌడ్ ఉద్యమ నాయకులు పెండం రవీందర్ ఉద్యమ నాయకులు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట రైతు వేదికలో విత్తనమేల కార్యక్రమం ప్రారంభం





**తొలి అక్షరం/రామన్నపేట జులై 27:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట (వర్షాధార) పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీఖాన్ తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విత్తనమేల కార్యక్రమాన్ని పిఎసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి రామన్నపేట ఉప సర్పంచ్ మోటె రమేష్ తో కలిసి ప్రారంభించారు.రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా స్థానిక పరిస్థితులకు అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు.రైతుల సౌకర్యార్థం అవసరమైన మెట్ట పంటల విత్తనాలను సంబంధిత రైతు వేదికలలో అందుబాటులో ఉంచడం జరిగింది. చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన రైతులు స్వల్పకాలికంగా పండే కందులు, మినుములు కూరగాయలకు చేయాలని సూచించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, సకాలంలో విత్తనాలను పొందడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలని కోరుతున్నాము.అధిక సమాచారం కోసం సమీప వ్యవసాయ అధికారి లేదా రైతు వేదికను సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జమీరుద్దీన్, వనం చంద్రశేఖర్, నాసర్, నోముల ప్రవీణ్ కుమార్, రైతులు ఉప్పలయ్య, యాదాసు రాములు, యాదమ్మ,సరిత నరసింహ వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. శ్రీనివాస్, పి.శ్రీనివాస్, వి.కీర్తన,ఈ.లావణ్య పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. మండల టాపర్లకు నగదు పురస్కారాలు

**- విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తల్లిదండ్రులకు ఘన సన్మానం**




**తొలి అక్షరం/చౌటుప్పల్:జులై 27:** చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి2026 ఫలితాల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మహమ్మద్ సమ్రీన్ (తండ్రి: మహ్మద్ సలీమ్), విద్యార్థి ఎం.డి. ఇర్ఫాన్ (తండ్రి: ఇమామ్ పాషా)లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, 1975 బ్యాచ్ ఉపాధ్యాయులు శ్రీ మంచికంటి కృష్ణమూర్తి గారు, పూర్వ విద్యార్థులు శ్రీ బడుగు శ్రీరాములు గారు, శ్రీ కృష్ణారెడ్డి గారు కలిసి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. అలాగే వారి తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యాభ్యాసంలో మరింత కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఇలాంటి పురస్కారాలు ఎన్నో అందుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రేరణ పొందుతారని పేర్కొన్నారు.

## శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల అధిక ఫీజులపై
# విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

**- తిగుళ్ళ శ్రీనివాస్ ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి**




**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 27:** యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్‌లోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపిస్తూ, సంబంధిత కళాశాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ సురేష్ రెడ్డిని కలిసి ఎస్ ఎఫ్ ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ, కళాశాల ప్రభుత్వం నిర్దేశించిన పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకుంటూ, అనుమతించిన సీట్ల కంటే అధిక సంఖ్యలో అడ్మిషన్లు నిర్వహిస్తోందని ఆరోపించారు. యూనిఫాం, పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి సుమారు ₹20,000 వరకు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై అదనపు ఒత్తిడి, వేధింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పేద విద్యార్థులకు కల్పించాల్సిన 25 శాతం ఉచిత సీట్లను అమలు చేయకుండా, అర్హులైన విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించడం లేదని ఆరోపించారు. అందువల్ల సంబంధిత కళాశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, అధిక ఫీజుల వసూళ్లను వెంటనే నిలిపివేసి పేద విద్యార్థులకు చట్టబద్ధంగా 25 శాతం ఉచిత సీట్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సురవి అరవింద్, పోలేపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు విడుదల చేయాలని నార్కెట్ పల్లి మహాధర్నా

**విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి**

**ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు**



**తొలి అక్షరం/రామన్నపేట జులై 27:** నార్కెట్ పల్లి విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో నార్కెట్ పల్లి లో మహా ధర్నా విద్యార్థి నాయకులకు పోలీసులకు తోపులాట ఏకధాటిగా విద్యార్థులపై దాడి చేసిన పోలీసులు బస్సుల పైకెక్కి నినాదాలు చేసిన విద్యార్థి నాయకులు తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, ఆధ్వర్యంలో జరిగిన ధర్నా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు నార్కెట్ పల్లి లో మహాధర్నా రాస్తారోకో చేశారు విద్యార్థులు వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి,, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికమూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్లకు సొంతభవనాలు నిర్మించాలి అప్పై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్రంలో ఎలాంటి మార్పు లేదు హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను తుంగలోకి తొక్కి ఈ ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని బెదిరిస్తుంది ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఎంపీ ఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, పాలకూరి రమేష్, డెక్కంటి గణేష్ చిలువేరు సిలువేరు నాగరాజు, పి సర్వయ్య గౌడ్,కారంపూడి సాయి, తేజ, మహేష్, బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ,బిఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

# ఫీజుల బకాయిలపై బీజేవైఎం ఆందోళన

**విద్యార్థుల హక్కుల కోసం బీజేవైఎం సంతకాల సేకరణ**

**షాద్‌నగర్‌లో సంతకాల సేకరణ.. పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్**






**తొలి అక్షరం/షాద్ నగర్,జులై 27:** రాష్ట్ర బీజేవైఎం పిలుపు మేరకు షాద్‌నగర్‌లో "ఫీజు బకాయిబీజేపీ లడాయి" కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బీజేవైఎం షాద్‌నగర్ అసెంబ్లీ కన్వీనర్ పుట్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో బీఏఎం డిగ్రీ కళాశాల, విశ్వభారతి ఇంటర్ కళాశాలలో సుమారు 300 మంది విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బుర్ర అభినయ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. బకాయిల కారణంగా పలు కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడంతో పాటు పరీక్షలు, ఉన్నత విద్య ప్రవేశాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి విద్యా సంవత్సరానికి నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నిధులు విడుదల చేసే శాశ్వత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ఆర్అండ్‌బీ డీఈఈగా స్వప్నలత బాధ్యతలు

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఈఈ**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** షాద్‌నగర్ ఆర్అండ్‌బీ (రోడ్లు, భవనాలు) శాఖ డివిజన్‌కు నూతన డీఈఈగా ఏ. స్వప్నలత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం షాద్‌నగర్ క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూ ర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో హైదరాబాద్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఆర్అండ్‌బీ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన స్వప్నలత, షాద్‌నగర్ నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను నాణ్యతతో, సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# జీడికల్‌లోని సీతారామాలయంలో ఆషాఢ మాస వనభోజనాలు


**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ ప్రజల జీవన విధానానికి ప్రతీక అయిన ఆషాఢ మాస వన భోజనాలను పురస్కరించుకొని హన్మకొండ టీఎన్జీవోస్ కాలనీ ఫేస్-2 లోని కాలనీ పరపతి సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు దాదాపు 400 మంది లింగాల ఘణపురం మండలంలోని జీడికల్ గ్రామంలో కొలువైన శ్రీ సీతారాముల ఆలయాన్ని సందర్శించి సామూహిక పూజలు నిర్వహించి అనంతరం స్థానిక వేడుకల మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మొత్తం కుటుంబాలు చిన్నా పెద్దలందరూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సమావేశంలో కాలనీ పరపతి సంఘం అధ్యక్షులు బోగేల్లి మధుకర్ రావు మాట్లాడుతూ దక్షిణాయనం ప్రారంభంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పచ్చదనం విరసిల్లాలని ప్రజలందరూ ఆరోగ్య సౌభాగ్యాలు పొందడానికి గ్రామదేవతలను పూజిస్తారని తెలిపారు. సామూహిక భక్తి విశ్వాసాలకు సామాజిక సమిష్టి జీవన తత్వానికి ప్రతికనే ఆషాడ వనభోజనాలని తెలిపారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోరెడ్డి సుధాకర్ రెడ్డి





మాట్లాడుతూ...పూర్తిగా గ్రామీణ సంస్కృతి వాతావరణం ప్రతిబింబించేలా కాలనీవాసులు మొత్తం గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఆషాడ మాస వనభోజనాలను నిర్వహించుకుంటూ, ఈ సంవత్సరం జీడికల్ లోని శ్రీ సీతారాముల ఆలయంలో నిర్వహించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులందరికిశైలజ, నవీన రాణి లు సంస్కృతిక పోటీ కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి పోషాల రమేష్, పరపతి సంఘం కార్యదర్శి, కోశాధికారి రామచంద్రారెడ్డి, రామకృష్ణ, బాధ్యులు రవీందర్ [illegible] రెడ్డి, ప్రసాద్, కాలనీవాసులు, మురళీధర్ రెడ్డి, పాలకుర్తి సదానందం, సురేష్, చంద్ర శేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, రఘున రెడ్డి, అయిలి నాగేశ్వరరావు, రామ్ రెడ్డి, యాదగిరి, మేకల శ్రీనివాస్, కిషన్ రెడ్డి, సదాశివరెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ రావు, రాఘవులు, వెంకట చారీ, చింత కరుణాకర్, సుమన్ రావు, దేవ్ సింగ్, మల్లారెడ్డి, శ్రీధర్ సింగ్, నరేందర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# 24 గ్రామాల యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కార్యవర్గ సభ్యుల నియామకం



**తొలి అక్షరం/రామన్నపేట జులై 27:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ఆదేశానుసారం తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏనుగు రఘుమా రెడ్డి సహకారంతో రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ 24 గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులను మరియు కార్యవర్గ సభ్యులను నియమించినట్టు రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టె సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ నూతన గ్రామ అధ్యక్షులకు కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కార్యకర్తలను సమన్వయం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. నూతన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందుతుంది అని నమ్ముతున్నానని అన్నారు. కొత్తగా నియమింపబడ్డ నాయకులకు విజయవంతమైన పదవీకాలం ఉండాలని కోరారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం హెడ్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ ఎన్ అశోక్



**తొలి అక్షరం/రామన్నపేట జులై 27:** ఉస్మానియా విశ్వవిద్యా లయం రాజనీతి శాస్త్ర విభాగనీ కి హెడ్ గా బాధ్యతలు తీసుకున్న ప్రొఫెసర్ శ్రీలత కు పూల మొక్క ను అందించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకు న్న డాక్టర్ ఎం అశోక్ ఈ కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కురిషిద్ మియా ..డాక్టర్ వెంకటేశం కల్తి. ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి...

## ఎంఈఓ ఆఫీస్ ముందు సిపిఎం ధర్నా...

**తొలి అక్షరం :వలిగొండ జులై 27:** ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రోజున వలిగొండ ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నేటికీ యూనిఫామ్స్ అందించలేదని వెంటనే యూనిఫారాలు అందించాలన్నారు, అదేవిధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం డైరీలను అందించాలని డిమాండ్ చేశారు, మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలోని జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాలకు వెంటనే ప్రహరీ గోడను నిర్మించాలని అదేవిధంగా మండల వ్యాప్తంగా అనేక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో పాఠశాలలను తొలగించే ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, డిప్యూటేషన్ పేరుతో ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు నిర్వహిస్తున్న టీచర్ల బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు అధిక నిధులను కేటాయించాలని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాచ్మెన్లను నియమించాలని డిమాండ్ చేశారు ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే మరొకవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే చర్యలను వెంటనే మానుకోవాలని ఇప్పటికే మండలంలో మూసివేసిన పాఠశాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మొగిలి పాక గోపాల్, కొండే కిష్టయ్య, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగాయ్య, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల నాగరాజు, ధ్యానబోయిన యాదగిరి, కొండూరు సత్తయ్య, ఉండాటి పాపయ్య, గంగాపురం వెంకటేశం, ఏటెల్లి నరసింహ, కందుల మత్స్యగిరి, కంబాలపల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

## - నర్సింహులపేట మండలంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ





**తొలిఅక్షరం/నర్సింహులపేట, జులై 27:** పేద ప్రజల వైద్య అవసరాలకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను నర్సింహులపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీనుకల రమేష్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జీనుకల రమేష్ మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్ డా. తరుణ్ జోషి.. సేవల మెరుగుదలపై కీలక ఆదేశాలు

**తొలి అక్షరం/నందిగామ,జులై 27:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ సోమవారం నందిగామ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రేవ్ అన్‌డిటెక్టెడ్ కేసులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో త్వరగా ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేలా




విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీసీటీఎన్ఎస్, ఈ-సాక్షి వంటి డిజిటల్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించి దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచాలని తెలిపారు. ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు వెంటనే స్పందించాలని



సూచించారు. అనంతరం కమిషనర్ డా. తరుణ్ జోషి కాన్హా శాంతివనాన్ని సందర్శించి అక్కడి నిర్వాహకులతో సంస్థ సేవల గురించి తెలుసుకున్నారు. చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్య, క్రమశిక్షణ, మంచి విలువలతో ఎదగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జోన్ డీసీపీ శ్రీమతి శిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, నందిగామ ఎస్‌హెచ్‌ఓ బి. వీరబాబు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి సర్పంచుల ఐక్య పోరు

- మహబూబాబాద్‌లో చైతన్య సదస్సు..
- సర్పంచుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరిన ప్రతినిధులు




**తొలిఅక్షరం/మహబూబాబాద్, జులై 27:** గ్రామాల అభివృద్ధి, గ్రామపంచాయతీల బలోపేతమే సర్పంచుల ఉద్యమ లక్ష్యమని ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ గునిగంటి కమలాకర్ అన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్‌లో నిర్వహించిన సర్పంచుల చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన సుమారు 450 మంది సర్పంచులు సమావేశానికి హాజరై గ్రామపంచాయతీల సమస్యలు, అభివృద్ధి పనులు, స్థానిక సంస్థల బలోపేతంపై చర్చించారు. గ్రామాభివృద్ధి కోసం సర్పంచులు సొంత నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం గ్రామపంచాయతీలకు తగిన నిధులు విడుదల చేయాలని కమలాకర్ కోరారు. ప్రస్తుతం అందుతున్న రూ.6,500 గౌరవ వేతనాన్ని రూ.20 వేలకు పెంచాలని, ఉపసర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. ప్రతి నెల జిల్లా కలెక్టర్‌తో, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ముఖ్యమంత్రితో సమావేశాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే భరించాలని, పదవీకాలం ముగిసిన అనంతరం సర్పంచులకు పెన్షన్ కల్పించాలని కోరారు. తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సర్పంచుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా జేఏసీ ఉద్యమం ఉధృతం

## జీవో 641 రద్దు వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మరింత వేగం పుంజుకుంది. సిద్దాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన జేఏసీ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 641ను



వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో రద్దు అయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం చేపట్టే ప్రతి ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని విస్తరించాలని సమావేశంలో నిర్ణయించారు.

# దోమలను అరికడదాం.. సీజనల్ వ్యాధులను నివారిద్దాం

**- చించోడు గ్రామసభలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు అవగాహన**



**తొలి అక్షరం/షాద్‌నగర్, జులై 27:** వర్షాకాలంలో పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను సమర్థంగా నివారించవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు తెలిపారు. సోమవారం చించోడు గ్రామ పంచాయతీలో సర్పంచ్ రాకాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఫరూక్‌నగర్ మండల ఎంపీడీవో శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, వాతావరణంలో తేమ పెరగడం వల్ల దోమలు, ఈగలు విస్తరిస్తాయని, వాటి ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధుల లక్షణాలైన జ్వరం, చలి, తలనొప్పి, కండరాల నొప్పులు, దద్దుర్లు, వాపులు వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలని సూచించారు. అలాగే కలుషితమైన నీరు, ఆహారం వల్ల విరేచనాలు, వాంతులు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితుల్లో ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వడంతో పాటు సురక్షితమైన తాగునీరు వినియోగించాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనివ్వకుండా చూడటం, మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటిని తాగడం, వేడి ఆహారం తీసుకోవడం, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, దోమతెరలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచ్ రాకాల శ్రీనివాస్, డిప్యూటీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, విలేజ్ సెక్రటరీ జయపాల్ రెడ్డి, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చిన 15 రోజుల్లోనే పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**• భాగ్యనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం**





**తొలి అక్షరం/షాద్ నగర్,జులై 27:** మాట ఇచ్చిన 15 రోజుల్లోనే ఇచ్చిన హామీని నెరవేర్చుతూ షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు భాగ్యనగర్ కాలనీలో పోచమ్మ గుడి దేవాలయం వద్ద ఈ నెల 9న ఐమాక్స్ లైట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు దేవాలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించాలని మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. కాలనీవాసుల విజ్ఞప్తిపై స్పందించిన చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ 15 రోజుల్లోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి, ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బచ్చలి నరేష్, చందులాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, నాయకులు తంగడపల్లి శంకర్, కత్తి చంద్రశేఖరప్ప, జుట్టు అనిల్, మేకల వెంకటేష్, బచ్చలి రమేష్, ప్రవీణ్, శ్రీనివాస్, శంకరయ్య, రామచందర్, రమేష్, తిరుపతి గౌడ్, యాదయ్య, రంగన్న, చంద్రకళ, జయమ్మ, నిర్మల, యశోద, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలి...



**తొలి అక్షరం/వలిగొండ జులై 27:** వలిగొండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గంధ మల్ల బాలయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షులు జోగు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల కొరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటుచేసిన కేకే కమిటీకి ధన్యవాదాలు తెలియజేస్తూ కేకే కమిటీ కాలయాపన చేయకుండా ప్రజాపాలనలో భాగంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలను అమలు పరచాలని ఉద్యమకారులకు, ఉద్యమ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17 తేదీలోపు సంక్షేమ పథకాలను అమలుపరచాలని కోరారు. ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి కదిరేని స్వామి యాదాద్రి భువనగిరి జిల్లా కళాకారుల విభాగం కన్వీనర్ మల్లశీ వెంకటేశం, ఎక్కల దేవి శ్రీనివాస్, కన్నె కంటి శ్రీనివాసచారి, ఎడవెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

# సేవాలాల్ మేరామా యాడి గుడిలో భారీ చోరీ

**రెండు హుండీలను పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లిన దుండగులు**

**6 నెలల వ్యవది లో రెండోసారి చోరి**

**ఆదివారం నాడు ఘనంగా బోనాలను ఉత్సవాలు నిర్వహించిన తండావాసులు**

**తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న తండావాసులు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** ఫరూక్నగర్ మండలం కడియాల కుంట తండా గ్రామపంచాయతీ పరిధిలోని ఇటీవలే నూతనంగా నిర్మించిన బంజరుల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ మరియు మేరమాయాడి గుడిలోని రెండు హుండీలను గుర్తు తెలియని దుండగులు సోమవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల సమయంలో రెండు గుండెలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఇలా హుండీని దొంగతనం చేయడం దాదాపు ఆరు నెలల ముందు ఫిబ్రవరి నెలలో ఒకసారి రెండు హుండీలను పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు మరోసారి ఈరోజు రెండు హుండీలను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లడం జరిగింది. ఆదివారం రోజు ఘనంగా సేవాలాల్ మహారాజ్ భోగ్ బండారు మరియు మేరమయాడి యొక్క బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్న తర్వాత రోజునే ఇలా గుడిలో దొంగతనం జరగడం వలన భక్తులు తండవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఉన్నతాధికారులు స్పందించి మరోసారి ఇలాంటి ఘటనలు పునవృతం కాకుండా చూడాలని తండావాసులు గ్రామ పెద్దలు కోరుతున్నారు.

# నర్సింహులపేటలో మూడు రోజుల విత్తన మేళా

**- ఆరుతడి పంటల విత్తనాలు అందుబాటులో.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన**



**తొలిఅక్షరం/నర్సింహులపేట, జులై 27:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నర్సింహులపేట రైతు వేదికలో జులై 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయడానికి అనుకూలమైన ఆరుతడి పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. మేళాలో పెసర, కంది, మినుము విత్తనాలు లభిస్తాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన విత్తనాలను పొందడంతో పాటు, పంటల ఎంపిక, సాగు యాజమాన్యం, వర్షాభావ పరిస్థితుల్లో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై వ్యవసాయ శాఖ అధికారుల నుంచి అవగాహన పొందాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, అగ్రోస్ డీలర్ వేముల నర్సింహారెడ్డి, ఏ ఈ ఓ మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్**

**విత్తన మేళాలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు**

**వెల్‌జర్లలో ఘనంగా విత్తన మేళా**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వెల్‌జర్ల గ్రామ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలను పరిశీలించి, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి ఆహ్వానించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, భరత్ లహోటి, వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్, కొండన్నగూడ గ్రామ సర్పంచ్ అనురాధ సురేష్ గౌడ్, వెల్‌జర్ల గ్రామ ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, ఏఓ నిశాంత్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈఓలు గోవర్ధన్, తేజ్‌కుమార్, వినయ్, రాంబాబు, హెచ్‌ఈఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్‌జర్ల గ్రామ నాయకులు కటికెల తిరుపతి యాదవ్, జాంగారి రవి, జాంగారి జంగయ్య, దాస్య నాయక్, దొడ్డి రామదాసు, వార్డు సభ్యులు వెంకటయ్య నాయక్, పవన్ ముదిరాజ్, వట్టెల ప్రవళిక, మహేష్ యాదవ్, రవి నాయక్, నాయకులు కావలి యాదయ్య, సత్యం రెడ్డి, హరిచంద్ర నాయక్, రాజు, వెంకటేష్, ఎర్ర పెంటయ్య, శ్రీను నాయక్, రమేష్, మేళ్లగూడ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు. కొండన్నగూడ గ్రామానికి చెందిన నేతలు వెంకట్ రెడ్డి, సురేష్ గౌడ్, వై. శ్రీనివాస్ యాదవ్, అంజయ్య గౌడ్, యాదయ్య గౌడ్, మహిపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్ యాదవ్ కార్యక్రమంలో పాల్గొని రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

# అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

**మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**

**అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు**

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళి**

**యువతకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకం**

**దేశ అభివృద్ధికి కలాం ఆశయాలను ఆచరించాలి**

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి**





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, చందులాల్, కత్తి చంద్రశేఖర్, అప్ప మహమూద్, ముబారక్ అలీ ఖాన్, భాస్కర్ గౌడ్, జయప్రకాష్, నందిగామ శేఖర్, షఫీదిన్, శ్రీహరి గౌడ్, బాబు నాయక్, శ్రీనివాస్, మాధవ్ యాదవ్, జగదీష్, సాజిద్, టీజేఏసీ నేతలు జనార్ధన్, టెలిఫోన్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదువుకొని శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఎదిగి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. యువత కలలు కనాలని, ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని ప్రేరేపించిన మహనీయుడు అబ్దుల్ కలాం అని అన్నారు. దేశ రక్షణ రంగంలో, శాస్త్ర సాంకేతిక రంగంలో ఆయన చేసిన కృషి భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో గర్వపడేలా చేసిందన్నారు. అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ముఖ్యంగా విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కలాం చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను స్మరించుకోవడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని అగ్గనూర్ బసవేశ్వర్ అన్నారు.

# సకాలంలో వర్షాలు కురిసి, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలి

- షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కనీ నరసింహులు
- సకాలంలో వర్షాలు కురవాలని జానంపేటలో వరుణ యాగం



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** సకాలంలో వర్షాలు కురిసి, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు సోమవారం జానంపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరుణ యాగాన్ని ప్రారంభించారు.ప్రకృతి ప్రకోపం కారణంగా కాలం దాటిపోతున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు, ప్రజలు తాగునీరు, సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బక్కని నర్సింహులు తెలిపారు. ఈ కష్టాల నుంచి ప్రజలకు విముక్తి కలగాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, జలాశయాలు నిండాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ యాగంలో మాజీ ఆప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్, ప్రముఖ వ్యాపారవేత్త సాయిశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వరుణ యాగం ఉద్దేశం: సకాలంలో వర్షాలు కురవడం, చెరువులు, జలాశయాలు నిండడం, రైతులకు సాగునీరు అందుబాటులోకి రావడం, ప్రజలకు తాగునీటి సమస్యలు తొలగి సుఖసంతోషాలతో జీవించేలా ప్రకృతి అనుకూలంగా ఉండాలని వరుణ దేవుడిని ప్రార్థిస్తూ ఈ యాగాన్ని నిర్వహించారు.

# ఏళ్ల నిరీక్షణకు ముగింపు.. షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు శ్రీకారం

**ఆక్రమణల తొలగింపుతో వేగం అందుకున్న చౌరస్తా విస్తరణ.. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**

**షాద్‌నగర్‌లో మెగా రోడ్ విస్తరణ ప్రారంభం.. అధికారులకు వ్యాపారుల సహకారం, వాహనదారుల్లో హర్షం**







**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 27:** ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులు సోమవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, తహసీల్దార్ నాగయ్య, సీఐ సీతారాం ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి విస్తరణ పనులు ప్రారంభించి, రోడ్డుకు ఇరువైపులా 50 అడుగుల పరిధిలో ఉన్న ఆక్రమణలను జేసీబీల సహాయంతో తొలగించారు. పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా సహకరించి ఆక్రమణలను తొలగించగా, మరికొందరు కొంత గడువు ఇవ్వాలని అధికారులను కోరారు. దశలవారీగా పట్టణంలోని అన్ని వైపులా విస్తరణ పూర్తి చేసి, చివరగా ప్రధాన కూడలిని విశాలంగా తీర్చిదిద్దాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ ప్రతిపాదన గతంలో పలుమార్లు వచ్చినా, వ్యాపారుల అభ్యంతరాలతో అమలు కాలేదు. అయితే ఇటీవల పెరిగిన ట్రాఫిక్ రద్దీ, వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన డిమాండ్లతో ఈసారి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది.విస్తరణ పనులు ప్రారంభం కావడంతో వాహనదారులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వానల కోసం అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు

- డోర్నకల్‌లో ముస్లిం సోదరుల దువా..
- పచ్చని పంటలతో రైతన్నలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్ష




**తొలి అక్షరం/మహబూబాబాద్ జులై 27:** తెలంగాణ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు కురవక విత్తనాలు మొలకెత్తక చేనుల్లోనే ఎండిపోతుండటంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.ఈ నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ముస్లిం సోదరులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. అల్లా కరుణించి రాష్ట్రాన్ని కరువు కోరల నుంచి కాపాడాలని, సమృద్ధిగా వర్షాలు కురిపించాలని వేడుకున్నారు. పచ్చని పంటలతో రైతుల ఇళ్లు కళకళలాడాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.అలాగే తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న మూగజీవాలు, పశుపక్ష్యాదులకు కూడా ఉపశమనం కలగాలని మత పెద్దలు దువా చేశారు. ఈ కార్యక్రమంలో మత గురువు హాఫిజ్ సుల్తాన్, మజీద్ కమిటీ అధ్యక్షుడు సలీం పాషా, ఖాదర్ బాబా, గౌస్, అస్గర్, నవాబు, ఫరీద్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ మెట్రో వద్ద జలమయం.. క్షణాల్లో స్పందించిన ఇక్రాన్ షేక్

**చిన్న వర్షానికే చెరువును తలపించిన రహదారి.. ఘటనాస్థలంలోనే నిలబడి సహాయక చర్యలకు శ్రీకారం**


**హైడ్రా ఇన్‌చార్జ్‌కు వెంటనే ఫోన్.. ప్రజల ఇబ్బందులు తొలగే వరకు పర్యవేక్షించిన హైదర్‌నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 27:** హైదరాబాద్, నగరంలో కురిసిన స్వల్ప వర్షానికే జేఎన్టీయూ మెట్రో స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారి చెరువును తలపించేలా జలమయమైంది. భారీగా నిలిచిన వర్షపు నీటితో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, విషయం తెలుసుకున్న హైదర్‌నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ఇక్రాన్ షేక్ ఎలాంటి ఆలస్యం చేయకుండా నేరుగా ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.నీటిలోనే నిలబడి ప్రజల సమస్యలను కళ్లారా గమనించిన ఆయన, అక్కడి పరిస్థితిని వెంటనే హైడ్రా ఇన్‌చార్జ్ గురు దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్‌లో సమస్య తీవ్రతను వివరించి అత్యవసర చర్యలు చేపట్టాలని కోరడంతో అధికారులు తక్షణమే స్పందించారు. హైడ్రా సిబ్బంది, సంబంధిత అధికారులు రంగంలోకి దిగి నిల్వ నీటిని తొలగించే పనులను ప్రారంభించారు.సహాయక చర్యలు ప్రారంభమైన తర్వాత కూడా ఇక్రాన్ షేక్ అక్కడి నుంచి వెళ్లకుండా అధికారులతో సమన్వయం చేస్తూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన నీటిని తొలగించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, జేఎన్టీయూ మెట్రో పరిసరాల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత శాఖలతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు శ్రీధర్ పంతులు కూడా అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రజా సమస్యలపై సమాచారం అందిన వెంటనే స్పందించి, అధికార యంత్రాంగాన్ని కదిలిస్తూ, సమస్య పరిష్కారమయ్యే వరకు అక్కడే ఉండి చర్యలను పర్యవేక్షించిన ఇక్రాన్ షేక్ తీరును స్థానికులు అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వానికి ఇది నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ

- పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై గందరగోళం
- ఆసుపత్రి మార్పిడిపై కలకలం
- స్పష్టత ఇవ్వాలంటున్న అభిమానులు
- డా. జితేందర్ రావు తనుగుల, సీనియర్ జర్నలిస్ట్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూలై27:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై సోమవారం మీడియాలో వెలువడిన పరస్పర విరుద్ధ కథనాలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఆయనకు హనుమకొండలోని స్వగృహంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రోహిణి ఆసుపత్రికి తరలించారు.అక్కడ అత్యవసర చికిత్స అందించిన అనంతరం,మెరుగైన వైద్యం కోసం గ్రీన్ కారిడార్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించినట్లు కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే, ఆయన రోహిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొన్ని వార్తా సంస్థలు ప్రచురించడం కలకలం రేపింది. ఈ విరుద్ధ సమాచారంపై అధికారిక స్పష్టత రావలసి ఉంది. రోహిణి ఆసుపత్రి వైద్యుల అధికారిక ప్రకటన, యశోద ఆసుపత్రి తాజా మెడికల్ బులెటిన్ మరియు కుటుంబ సభ్యుల ధృవీకరణ ఆధారంగా మాత్రమే తుది సమాచారాన్ని వెల్లడించడం సముచితం. జర్నలిజం దృష్టికోణంలో చూస్తే.. ఇటువంటి అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో ఆసుపత్రి తరలింపు సమాచారం, పాత బులెటిన్లు,తదనంతర పరిణామాలు పరస్పరం కలిసిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ప్రాథమిక, అధికారిక వైద్య ధృవీకరణ లేకుండా మృతి వార్తలను ఖరారు చేయడం సరైన పద్ధతి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడమే మీడియా ప్రధాన బాధ్యత. కాబట్టి సంబంధిత వర్గాల నుంచి తుది ధృవీకరణ వచ్చిన తర్వాతే ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన వెలువడాల్సి ఉంది.

– డా. జితేందర్ రావు తనుగుల, సీనియర్ జర్నలిస్ట్

# ఉద్యమకారుల గుర్తింపులో కాలయాపన తగదు

- కేసులు,ఇంటెలిజెన్స్ నివేదికలు ఉన్నా ఎందుకు ఆలస్యం?
- మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు
- కేకే కమిటీ తీరుపై మండిపడిన ఫోరం నాయకులు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూలై27:** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియలో ప్రభుత్వం, కేకే కమిటీ అనవసర కాలయాపన చేస్తోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు గురువారం తొర్రూర్ డివిజన్, మండల నాయకులు స్థానిక విశ్రాంతి భవనం (గెస్ట్ హౌస్)లో విలేకరుల సమావేశం నిర్వహించారు. స్థానిక నాయకుడు తాళ్ల మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ముద్దసాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...కేకే కమిటీ వ్యవహరిస్తున్న తీరు ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు.మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారిపై నమోదైన ఎఫ్ఐఆర్ లు, బైండోవర్ కేసులు, పోలీసుల వద్ద ఉన్న బయోడేటా ఆధారంగా ఉద్యమకారులను సులభంగా గుర్తించవచ్చు అని తెలిపారు.లేదా ఇంటెలిజెన్స్ నివేదికల ద్వారా ప్రభుత్వం డేటా తెప్పించుకోవచ్చు అని అన్నారు.అలా చేయకుండా అందరినీ హైదరాబాద్ వరకు పిలిపించి ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదు అని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కాలనే నమ్మకంతోనే ప్రభుత్వం దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర నాయకులు వాచ్ రెడ్డి నరసింహారెడ్డి, గౌరిశెట్టి అల్లబాబు, కొండ వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆనేపురం వెంకన్న, మండల నాయకులు ఏర్పుల వెంకన్న, తీగల ఎల్లారెడ్డి, పైండ్ల వెంకటయ్య, మంగళపల్లి సోమయ్య, విద్యాసాగర్, గాదని రమేష్, బేతమల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్‌లో మహేంద్రగిరి వారహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.


# ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల




టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

-------

# త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించనుంది. ఈ సీన్‌ను సినిమాకే హైలైట్‌గా నిలిచేలా అత్యంత భారీ స్థాయిలో ఎ÷-లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరిచేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్, ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.


# పొలిమేర-3 లో అర్జున్



టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# లావణ్యపై బాడీ షేమింగ్..

## అండగా నిలిచిన మెగా ఫ్యాన్స్



మెగా కుటుంబ కోడలు, నటి లావణ్య త్రిపాఠి తాజాగా బాడీ షేమింగ్‌కు గురయ్యారు. ప్రసవం అనంతరం ఆమె శరీర ఆకృతిలో వచ్చిన మార్పులపై సోషల్ మీడియా వేదికగా కొందరు నెటిజన్లు ప్రతికూల వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఈ ట్రోల్స్‌ను గట్టిగా తిప్పికొడుతూ లావణ్యకు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు.ఇటీవల ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన లావణ్య, మునుపటి కంటే కాస్త బొద్దుగా కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వెలుగులోకి రావడంతో కొందరు నెటిజన్లు ఆమెను లక్ష్యంగా చేసుకుని 'లావుగా అయ్యారు', 'ఆంటీలా కనిపిస్తున్నారు' అంటూ అనుచితంగా వ్యాఖ్యానించారు.
మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకున్న లావణ్య, 2025 సెప్టెంబర్‌లో మగబిడ్డ (వాయువ్ తేజ్)కు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఆమె సినిమాలకు దూరంగా ఉంటూ తన సమయాన్ని పూర్తిగా మాతృత్వానికే కేటాయిస్తున్నారు. సాధారణంగా ప్రసవం తర్వాత హార్మోన్ల మార్పుల కారణంగా మహిళల శరీర బరువు పెరగడం అత్యంత సహజమైన విషయం.ఈ నేపథ్యంలో, ఒక నూతన తల్లిపై ఇటువంటి విమర్శలు చేయడం శోచనీయమని మెగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రసవానంతరం మహిళల శరీరంలో మార్పులు రావడం సహజం. గతంలో ఐశ్వర్య రాయ్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర కథానాయికలు కూడా ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొన్నారు. సెలబ్రిటీలైనా, సామాన్యులైనా ప్రసవం తర్వాత తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ బాడీ షేమింగ్ సంస్కృతికి స్వస్తి పలకాలి" అంటూ వారు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం లావణ్యకు మద్దతుగా మెగా అభిమానులు చేస్తున్న పోస్టులు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి.



# 'ఇండియన్ ఐడల్ 16' విన్నర్ జ్యోతిర్మయి నాయక్..!

ప్రముఖ సింగింగ్ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్ 16' విజేతగా ఒడిశాకు చెందిన జ్యోతిర్మయి నాయక్ నిలిచారు. నిన్న అట్టహాసంగా జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో ఆమె రూ. 20 లక్షల నగదు బహుమతిని కూడా గెలుచుకున్నారు. ఫైనల్‌లో తనిష్క్ శుక్లా, అన్షికా చోంకర్, మన్‌రాజ్ వీర్ సింగ్, మైస్కమ్ బోసు, సుహైల్ సూఫీలతో పోటీపడి జ్యోతిర్మయి విజేతగా అవతరించారు. ఇండియన్ ఐడల్ చరిత్రలో ఒడిశా నుంచి టైటిల్ గెలుచుకున్న తొలి కంటెస్టెంట్‌గా ఆమె రికార్డు సృష్టించి, తన రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు.

**విజేత ప్రస్థానం..**

ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన 25 ఏళ్ల జ్యోతిర్మయి నాయక్, ఇండియన్ ఐడల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందకముందే ఒడిశా ప్రాంతీయ సంగీత పరిశ్రమలో సుపరిచితురాలు. ఆమె ఒక గాయని మాత్రమే కాదు, శిక్షణ పొందిన మ్యూజిక్ థెరపిస్ట్ కూడా. సంగీతం ద్వారా మానసిక, భావోద్వేగ సమస్యలకు చికిత్స అందించడంలో ఆమెకు నైపుణ్యం ఉంది. 'ఎపిక్ ఆరా లైఫ్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్ కథనం ప్రకారం.. రూర్కెలాలో జన్మించిన జ్యోతిర్మయి తల్లిదండ్రులు చక్రధర్ నాయక్, గౌరీ నాయక్. సంగీతంపై మక్కువ ఉన్న ఆమె తండ్రి, ఆమెను వృత్తిపరంగా ఈ రంగంలో ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.'డెక్కన్ క్రానికల్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్యోతిర్మయి తన సంగీత ప్రయాణం గురించి పంచుకున్నారు. మూడో తరగతిలో ఉన్నప్పుడే రూర్కెలాలో బుద్ధ ప్రసాద్ రావు వద్ద హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం ప్రారంభించినట్లు తెలిపారు. భువనేశ్వర్ వెళ్లాక తన ప్రస్తుత గురువు బాలకృష్ణ బైరా వద్ద శిక్షణ కొనసాగించారు. అదే సమయంలో గురు శారదా ప్రసన్న సాహు వద్ద బాలీవుడ్ పాటలపై ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. "ఆయన 2023లో మరణించినా, ఆయన బోధనలు నన్ను నడిపిస్తూనే ఉన్నాయి. పాటను ఎలా పాడాలో కాదు, భావాలను ఎలా అందంగా పలికించాలో ఆయన నేర్పించారు" అని జ్యోతిర్మయి గుర్తుచేసుకున్నారు.జ్యోతిర్మయి భువనేశ్వర్‌లోని కీట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత చెన్నై స్కూల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీ నుంచి సర్టిఫికేషన్ పొందారు. భవిష్యత్తులో అలియా భట్, దీపికా పదుకొణెలకు ప్లేబ్యాక్ సింగర్‌గా పాడాలనేది తన కల అని ఆమె తెలిపారు. "ఇండియన్ ఐడల్ గెలవడం ఒక కల నిజమైనట్లుగా ఉంది" అని తన ఆనందాన్ని పంచుకున్నారు.



# సూపర్ స్టార్ మనవడి ధీమా..

## నటుడిగానే నా ప్రయాణం అంటున్న జై కృష్ణ

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు తనయుడు జై కృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. నటుడిగా తనను తాను నిరూపించుకుని, ఇండస్ట్రీలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జై కృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రాషా తడానీ కథానాయికగా నటిస్తున్నారు. వైజయంతీ మూవీస్ అధినేత అశ్వినీదత్ సమర్పణలో పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ సినిమాలో ఒక శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.ఈ సందర్భంగా జై కృష్ణ మాట్లాడుతూ, "దర్శకుడు అజయ్ గారు తీర్చిదిద్దిన పాత్రలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. నటుడిగా నా ప్రతిభను చాటుకోవడానికి ఇది ఒక చక్కని కథ. మంచి సినిమాలు చేసే నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన," అని పేర్కొన్నారు.దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, "మహేశ్ బాబు గారి తరహాలోనే జై కృష్ణ కూడా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలిచిపోయే కథానాయకుడు అవుతాడు. సినిమా నేను అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది," అని ధీమా వ్యక్తం చేశారు. నటుడు నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ, కృష్ణ గారి వారసత్వాన్ని జై కృష్ణ ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ, వడ్లమాని శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.